


## ఎంఆర్ సంస్కృత కళాశాలలో ఎయు దూరవిద్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్ధననాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మహారాజా అటానమస్ కళాశాలలో ఉన్న ఎయు దూరవిద్య కేంద్రాన్ని సంస్కృత కళాశాలకు మార్చి పునఃప్రారంభించారని వెల్లడించారు. ఎయు దూరవిద్యలో డిగ్రీ, పిజి కోర్సులలో చేరడానికి నవంబర్ 15 వరకూ అవకాశం ఉందని చెప్పారు. యూనివర్సిటీ సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల ఆవరణలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దూరవిద్య సమాచారం కోసం ఎస్.రమణ- 9492021464ను సంప్రదించాలని సూచించారు.

# ఆగని డయేరియా మరణాలు

- ఏడుకు చేరిన మృతుల సంఖ్య
- భీతిల్లుతున్న గుర్ల గ్రామస్తులు
- మరికొన్ని గ్రామాల్లో బయటపడుతున్న కేసులు



గుర్ల హైస్కూల్లో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్



చీపురుపల్లి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శిస్తున్న తమ్మినేని, నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/గుర్ల

గుర్ల మండల కేంద్రంలో డయేరియా మరణాలు ఆగడం లేదు. తాజాగా గురువారం కూడా బోడసింగి రాములమ్మ (65), కోటగండ్రేడుకు చెందిన మరడాన అప్పలనర్సయ్యమ్మ(56) మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 22 మంది, చీపురుపల్లి సిహెచ్‌సిలో వెంపడాపు ఈశ్వరరావు, గోద ఆదిలక్ష్మి, బోర ఈశ్వరరావు సహా 13 మంది, విజయనగరంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో 15 మంది చొప్పున చికిత్స పొందుతున్నారు. ఇంకా కొంతమంది తమ ఇళ్లల్లోనే వాంతులు, విరేచనాలతో మంచాలపై ఉన్నారు. మృతుల సంఖ్య పెరుగుతుండడంతో గ్రామస్తులు భీతిల్లుతున్నారు. ఇలాంటి భయంతోనే రాములమ్మ మూడురోజులుగా భోజనం చేయడం మేనేసిందని కుటుంబ సభ్యులు తెలిపారని అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురైన కారణంగా రాములమ్మ చనిపోయినట్లు డిఎంహెచ్ ఎస్.భాస్కరరావు తెలిపారు. గుర్ల, గోషాడ, పున్నుపురెడ్డిపేట, కెల్ల, గూడెం, కోటగండ్రేడు గ్రామాల్లో డయేరియా కేసులు ఉన్నట్టు గత శనివారం వెలుగులోకి వచ్చింది. సోమవారం వరకు అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో అదేరోజు నలుగురు చనిపోయారు.

### కొనసాగుతున్న వైద్య శిబిరం

గుర్ల గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. రోగులందరికీ డయేరియా నివారణ చికిత్స చేస్తున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామంలో బోర్లు, కుళాయిల నీటి వాడకాన్ని నిషేధించారు. క్లోరినేషన్ చేసిన నీటి ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమాశంకర్ చెబుతున్నారు. ఈ గ్రామాన్ని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఉదయం సందర్శించారు. వైద్యాధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వివిధ ఆసుపత్రుల్లో బాధితులకు అందిస్తున్న వైద్యసహాయంపై మంత్రికి డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు వివరించారు. పారిశుధ్య నిర్వహణ పనులపై డిపిఒ వెంకటేశ్వరరావు తెలియజేశారు. గ్రామంలో తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలపై మంత్రి అధికారులతో చర్చించారు. తాగునీటి పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై కూడా రిపోర్టులు సేకరించాలని మంత్రి ఆదేశించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు.



డయేరియాతో మరణించిన రాములమ్మ (ఫైల్ ఫొటో)

### తాండవిస్తున్న అపారిశుధ్యం

గుర్ల గ్రామంలో మొన్నటి వరకు అపారిశుధ్యం తాండవించేది. కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. ఊరు పరిసర ప్రాంతాలు బహిర్భూమిని తలపించాయి. తాజాగా డయేరియా మరణాలు వెలుగులోకి రావడంతో ఊరు కాలిపోయాక నుయ్యి తవ్వినట్టు అధికారులు రెండు రోజులుగా గ్రామంలో బ్లీచింగ్ చల్లించడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో రాకపోవడం, వచ్చిన అరకొర నిధులను కూడా ఉపయోగించకపోవడం వంటివి ఈ గ్రామంలో డయేరియాకు ఒక కారణమై ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు.

### గరివిడి, చీపురుపల్లి మండలాల్లోనూ డయేరియా

గుర్లతోపాటు దానికి ఆనుకుని ఉన్న గరివిడి, చీపురుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోనూ డయేరియా కేసులు ఉన్నట్టు 'ప్రజాశక్తి' పరిశీలనలో బయటపడింది. గరివిడి మండలంలో కుమరాం, పాలవలసలో సుమారు 10 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. వీరిలో మీసాల అప్పలనర్స ప్రస్తుతం విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రిలో ఉన్నారు. మిగిలిన వారిలో మీసాల సిహాచలం, బాలి ఆశ, గదుల సూర్య తదితరులు చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నారు. పెనుబర్తికి చెందిన వెల్లంకి పైడిమ్మ చీపురుపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చీపురుపల్లి మండలం రావివలసలో కుప్పిలి గౌరీశంకర్ సహా ఆరుగురు డయేరియా బారినపడ్డారు. వీరిలో కొందరు చీపురుపల్లి ఆసుపత్రిలో చేరారు. ఈ గ్రామాలన్నీ చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని చంపావతి నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. దీంతో కలుషిత నీరే కారణమని తెలుస్తోంది.

### అధికారుల నిర్లక్ష్యం

గుర్లలో డయేరియా వ్యాప్తి, మరణాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈనెల 12వ తేదీకే గుర్లతోపాటు పైన పేర్కొన్న గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందినట్టు వెలుగులోకి వచ్చింది. 14వ తేదీ వరకు అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ స్పందించలేదని, పరిస్థితి విషమించి అదే రోజు నలుగురు మృతిచెందారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 14న వైద్య శిబిరం ఏర్పాటు చేసిన తరువాత కూడా ఇద్దరు మరణించడం గమనార్హం. తగిన వైద్యసేవలు, మందులు ఉంటే మరణాలు ఎందుకు పెరుగుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### తీరుమారకుంటే మరింత ప్రమాదకరం

ప్రభుత్వం తరపున అధికారులు, ప్రజాప్రతినిధులు కంటితుడుపు పరామర్శలకు పరిమితం కాకుండా గుర్ల గ్రామంలో వైద్యనిపుణులతో వైద్యసేవలు అందించకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు కేవలం చుట్టుపక్కల ఉన్న వైద్యులతోనే సేవలందిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కలుషిత నీరే కారణం



నీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలింది. పైపులైన్లకు ఎక్కడైనా రంధ్రాలు పడ్డాయేమో!. అధికారులు, మంత్రి, కలెక్టర్ మా గ్రామానికి వచ్చినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీనికితోడు మరణాలు పెరుగుతున్నాయి. భయంగా ఉంది.

- బోడసింగి అప్పలనాయుడు, గుర్ల గ్రామం

### తగిన వైద్యసేవలు అందడం లేదు



మా గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినప్పటికీ తగిన మందులు, చికిత్స అందడం లేదేమో!. రోగులకు సైలెన్స్ ఎక్కించి ఇళ్లకు పంపుతున్నారు. తిరిగి పరిస్థితి విషమిస్తోంది. గురువారం చనిపోయిన రాములమ్మ కూడా స్థానిక శిబిరంలో వైద్యసేవలు పొందింది. అయినా ప్రాణం దక్కలేదు.

- సారికి చిరంజీవి, గుర్ల గ్రామం

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరణాలు

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పన నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుర్ల, కోటగండ్రేడు గ్రామాల్లో డయేరియాతో ఏడుగురు మృతిచెందారని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మండిపడ్డారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్ల గ్రామాన్ని గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, గరివిడి ప్రాంత నాయకులు అంబల్ల గౌరినాయుడుతో కలిసి తమ్మినేని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను అవగతం చేసుకున్నారు. అనంతరం చీపురుపల్లి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందజేయాలని వైద్యాధికారులను కోరారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ గుర్ల సహా పలు గ్రామాల్లో డయేరియా ప్రబలినట్టు ఆరు రోజుల క్రితమే బయటపడినా ఇప్పటికీ అదుపు చేయలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. నేటి ఆధునిక సమాజంలో ఇంకా నీరు కలుషితం అవ్వడానికి కారణాలు తెలియలేదని మంత్రి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ లేబోరేటరీలతోపాటు అందులో సిబ్బంది, అధికారులు ఏమయ్యారని ప్రశ్నించారు. స్థానిక ఆసుపత్రులతో కాలక్షేపం చేస్తే మరింత నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా వైద్యనిపుణులను డయేరియా ప్రబలిన గ్రామాలకు పంపాలని డిమాండ్ చేశారు. గుర్ల మండలంలోని గ్రామాలతోపాటు గరివిడి, చీపురుపల్లి మండలాల్లోనూ డయేరియా వ్యాప్తి చెందిందని, అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసి, మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, రక్షిత నీటి సరఫరాను గాలికి వదిలేసి పల్లెపండగలు చేసుకోవడం వల్ల జనాలకు ఎలాంటి ఉపయోగమూ ఉండబోదన్నారు. అధికారులు, మంత్రి పర్యటనల కన్నా, మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.



మద్యం షాపు నిర్వహిస్తున్న బొబ్బిలికి చెందిన వ్యాపారి బినామీలు

# మద్యం షాపులు సిండి'కేట్' చేతుల్లోకి

**అంగీకరించకపోతే బెదిరింపులు**

*జిల్లాలో వైన్‌షాపులు దక్కించుకున్న వారికి కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. బొబ్బిలి ప్రాంతంలో మద్యం వ్యాపారంలో ఆరితేరిన ఓ వ్యక్తి.. కొందరు మద్యం వ్యాపారులను తన చేతిలో పెట్టుకొని మిగతా వారితో సిండికేట్ అయి షాపులను కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో ఐదు షాపులకు లాటరీ దక్కించుకున్న ఆయన.. మరోవైపు వ్యక్తిగతంగా లైసెన్సులు దక్కించుకున్న వారితో బేరసారాలకు దిగారు. 'గుడ్ విల్ కింద నెలకు ఇంత ఇస్తాం.. మీ లైసెన్స్‌ను వదిలేయండి' అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. లేకుంటే బెదిరింపులకు దిగుతున్నారు.*

ప్రజాశక్తి-బాడంగి

గతంలో మద్యం వ్యాపారంలో కింగ్‌మేకర్‌గా అవతరించిన బొబ్బిలికి చెందిన ఓ వ్యక్తి.. నూతన ప్రయివేటు మద్యం పాలసీ వచ్చాక సిండికేట్ అవతారమెత్తాడు. మద్యం వ్యాపారంలో ఆరితేరిన ఆయన బొబ్బిలి నియోజకవర్గంలో తన అనుచరులతో కలిసి మద్యం షాపులకు 300కు పైగా దరఖాస్తులు చేయించాడు. అందులో ఐదు షాపులు దక్కాయి. బొబ్బిలి నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని మద్యం వ్యాపారులతో కుమక్కై, కొత్తగా లాటరీలో షాపులను దక్కించుకున్న వారిని సిండికేట్‌లోకి లాగుతున్నాడు. బాడంగిలో లాటరీలో మద్యంషాప్ దక్కించుకున్న వారితో బొబ్బిలికి చెందిన ఓ వ్యక్తి సిండికేట్ అవ్వాలని ప్రయత్నించి, సాధించారు. బాడంగిలోని షాప్-17కు ఇలానే జరిగింది. రాయగడ ప్రాంతానికి చెందిన ఓ మహిళ లాటరీ ద్వారా షాపు దక్కించుకొని, బాడంగిలో షాపు పెట్టాలనుకున్నారు. బొబ్బిలికి చెందిన మద్యం వ్యాపారి తన అనుచరులను రంగంలోకి దింపి ఎలాగోలా సిండికేట్‌లోకి కలుపుకున్నాడు. ఇంకో షాప్-18కు సంబంధించి బలిజిపేట ప్రాంతం వారికి లాటరీ వస్తే వారిని కూడా సిండికేట్‌లోకి దించారు. ఇలా మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు ఎక్కువ మంది ఉండటంతో కొత్తగా లాటరీ దక్కించుకున్న వారు వ్యాపారం చేయలేని పరిస్థితికి తీసుకువచ్చారు. తాము చెప్పిన దానికి ఒప్పుకోని వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. లైసెన్సులు ఇవ్వకపోతే ఎటువంటి పెట్టుబడి లేకుండా తమకు 20 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. తమకు వాటా ఇవ్వకపోతే నియోజకవర్గ పరిధిలో వ్యాపారాలు ఎలా చేస్తారో చూస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

### దుకాణానికి రూ.కోటి

కొత్తగా మద్యం దుకాణం నిర్వహించాలంటే రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే తమకు లైసెన్సును అప్పగిస్తే రూ.కోటి నుంచి రూ.1.2 కోట్ల వరకు నగదు ఇస్తామని మద్యం సిండికేట్ బంపర్ ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిసింది. బాడంగి, బొబ్బిలి ప్రాంతంలోనైతే ఒక్కో దుకాణానికి రూ.కోటి చొప్పున ఇస్తామని ఆశ చూపుతున్నారు. ఇంకొన్ని చోట్ల అయితే లైసెన్స్ అప్పగిస్తే డబ్బులతోపాటు పెట్టుబడి లేకుండానే గుడ్‌విల్ కింద నెలకు రూ.15 వేల వరకు ఇస్తామని మభ్యపెడుతున్నారు.

## పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

**జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్**

ప్రజాశక్తి-విజయనగరం కోట



అధికారులతో సమావేశమైన జెసి సేతు మాధవన్

జిల్లాలో పత్తి రైతుల జాబితాను సిద్ధం చేసి, కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు తన ఛాంబర్లో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పత్తి క్వింటాకు 7,521 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లాలో 175 గ్రామాలలో 20,176 క్వింటాళ్ల పంట వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. నవంబరు రెండో వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఆలోగా వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాజాం, రామభద్రపురంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పత్తి రవాణాకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఎడి బి.రవికిరణ్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పివి రంగారెడ్డి, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ, ఉద్యాన శాఖ ఎడి శైలజ తదితరులు పాల్గొన్నారు.

### సరసమైన ధరలకు సరుకులు అందించాలి

నిత్యావసర సరకులను సరసమైన ధరలకు అందించాలని జెసి సేతు మాధవన్ తెలిపారు. మార్కెట్‌లో ధరలు పెరగకుండా టోకు వర్తకులు సహకరించాలని కోరారు. గురువారం తన ఛాంబర్‌లో ధరల స్థిరీకరణపై సంబంధిత అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమాటో, ఉల్లి, బంగాళా దుంపలు స్థానికంగా ఉత్పత్తి లేనందున టోకు వర్తకులపై ఆధారపడవలసి వస్తుందని చెప్పారు. వారు అధిక లాభాలకు విక్రయించకుండా, వారికి కూడా నష్టం జరగకుండా సరసంగా ఉండే ధరలకు ప్రజలకు అమ్మేలా సహకరించాలని కోరారు. రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. ఇటీవల టమాటో రాష్ట్రమంతటా సుమారు రూ.100కు విక్రయించినా, విజయనగరం రైతుబజార్‌లో రూ.45కే అందించగలిగామని చెప్పారు. అందుకు సహకరించిన హోల్ సేల్ వర్తకులను అభినందించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఎడి రవి కిరణ్, డిఎస్‌ఒ మధుసూదన్, ఉద్యాన, వ్యవసాయ శాఖల ఎడి లు శైలజ, అన్నపూర్ణ, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు సతీష్, ఉమామహేశ్వరరావు, అప్పలనాయుడు, సూపరింటెండెంట్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


## పైడితల్లమ్మ హుండీ ఆదాయం రూ.56 లక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.56 లక్షలు లభించింది. గురువారం మన్సాస్ ట్రస్ట్ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో చదురుగుడిలో 9 శాశ్వత, 8 తాత్కాలిక హుండీలు తెరిచారు. 14 రోజులకు గాను రూ.45,02,25 ఆదాయం సమకూరింది. 4 గ్రాముల బంగారం, 95.5 గ్రాముల వెండి, 21 డాలర్లు, రూ.50 వేలు విలువైన ఇండోనేషియా కరెన్సీ నోటు వచ్చాయి. వనంగుడిలో 7 హుండీలు తెరవగా 45 రోజులకు గాను రూ.11,41,151 ఆదాయం వచ్చింది. సొమ్ము మొత్తాన్ని బ్యాంకు అధికారులకు కల్యాణ మండపం వద్ద అప్పగించారు. పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు సహాయ కమిషనర్ డివివి ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి

## వాల్మీకి జీవితం ఆదర్శనీయం

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ, బిసి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ బిఆర్.అంబేద్కర్ మాట్లాడారు. వాల్మీకి కుల సంఘాల నాయకులు వాల్మీకి విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, జెసి సేతు మాధవన్, డిఆర్‌ఒ అనిత, బిసి సొసైటీ ఇడి పెంటోజీరావు, డిబిసిడబ్ల్యుఒ యశోదనరావు, వాల్మీకి సంఘం, బోయ సంఘం, బి సి సంఘం ప్రతినిధులు పువ్వల మురళి, రామారావు, ఆచారి, విజయలక్ష్మి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికే పల్లె పండగ

**మంత్రి శ్రీనివాస్**

ప్రజాశక్తి-బొండపల్లి, గజపతినగరం

ఉపాధి హామీ నిధులతో పల్లెలను అభివృద్ధి చేసే లక్ష్యంతోనే రాష్ట్రంలో పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. బొండపల్లి మండలంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న పలు రోడ్లకు మంత్రి గురువారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. గజపతినగరం మండలంలోని పురిటిపెంట, జిన్నాం, మరుపల్లి పల్లెపండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొణిశ నుండి గొల్లుపాలెం వరకు రూ.2 కోట్లతో నిర్మించే 2.7 కిలోమీటర్ల రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. మరువాడ నుంచి ఎం.కొత్తవలస వరకు రూ.65 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు మరువాడలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలో పల్లె పండగలో భాగంగా 22.55 కోట్లతో 156 పనులను చేపడుతున్నామని చెప్పారు. ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో మంజూరైన రోడ్డు పనులను రైతుల సహకారంతో పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధి నిధులను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మరువాడలో అంగన్‌వాడీ పిల్లలతో మంత్రి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సందీప్, పంచాయతీ రాజ్ ఎస్‌ఇ శ్రీనివాస్, టిడిపి నాయకులు కొండపల్లి కొండబాబు, ఎంపిడిఒ గిరిబాల, మరువాడ సర్పంచ్ డోకి పార్వతి, నాయకులు పివివి గోపాలరాజు, మాజీ ఎంపిపి శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్ పాల్గొన్నారు.

## బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాల, బాలికల విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపికను గురువారం స్థానిక కోడి రామ్మూర్తి వ్యాయామశాలలో చేపట్టారు. 30 మంది క్రీడాకారులు హాజరుకాగా, నలుగురిని ఎంపిక చేశారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శ్రీను, పీడీ సూర్యనారాయణ పాల్గొన్నారు..

### పోటీలను ప్రారంభించిన డిఎస్‌డిఒ

రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఉన్న బాక్సింగ్ రింగ్‌లో బాక్సింగ్ ఎంపిక పోటీలను డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అండర్-17 విభాగంలో 8 మంది, అండర్ -14 విభాగంలో 11 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కృష్ణంరాజు, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.మన్మథరావు క్రీడాకారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు, స్థానికులు

## మార్కెట్లో మద్యంషాపు ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని మార్కెట్‌లో మద్యం షాపు పెట్టవద్దని స్థానికులు నిరసన తెలిపారు. బజారులో కళింగ వైశ్య భవనం సమీపంలో గురువారం రాత్రి మద్యం షాపు ఏర్పాటుకు వ్యాపారులు ప్రయత్నించారు. మహిళలు, స్థానికులు చేరుకుని వ్యాపారులను ఘెరావ్ చేశారు. నిత్యం జనాలతో రద్దీగా ఉండే బజారులో మద్యం షాపు పెట్టడం దుర్మార్గమని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం షాపు పెడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. నిరసనకు టిడిపి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు మద్దతిచ్చారు.

## కాలువల్లో పూడికలు తీయించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వార్డు పర్యటనలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు 13వ డివిజన్‌లో పర్యటించారు. అక్కడక్కడ సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్నిచోట్ల కాలువలు సరిగా లేవని, పూడికలు పెరిగిపోయాయని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి, పరిష్కారమయ్యేలా చొరవ చూపుతామన్నారు. వార్డు పర్యటనలో రెండు అంగన్వాడీ కేంద్రాలను కూడా పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

## నవసమాజ నిర్మాణంలో టీచర్లదే కీలకపాత్ర

**బొబ్బిలి:** నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. విద్యార్థులకు మంచి విద్యా బుద్ధులు నేర్పి సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరు గౌరవించాలని కోరారు. 100మంది రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి, నాయకులు సిహెచ్ రామ్మూర్తి, ఎల్.జగన్నాధం, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబర్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

**బొబ్బిలి:** గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ కోరారు. గొపాలరాయుడుపేట పంచాయతీలో ఉన్న గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గిరిజనులతో కలిసి ఎమ్మెల్యేకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించాలని గతంలో పాలకులకు వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాసీ సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

## చదువే మనిషికి మూడో నేత్రం

**తెర్లాం:** చదువే మనిషికి మూడో నేత్రమని, చదువుతోనే మంచి భవిష్యత్తు ముడిపడి ఉంటుందని ఎస్ఐ సాగర్ బాబు అన్నారు. స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకొని సమాజానికి దేశానికి మంచి పేరు తేవాలని కోరారు. ప్రధానంగా మత్తు పదార్థాలకు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఖైనీ, గుట్కాలు, మద్యపానం వంటి వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**తెర్లాం:** స్థానిక గ్రంథాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఇఒ ఎం సత్యనారాయణ, గ్రంథాలయ శాఖాధికారి సిహెచ్ కృష్ణమూర్తి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకి ఆదికవి అని రామాయణం వంటి మహా గ్రంథాన్ని రచించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

## ఆయాలకు అవగాహన సదస్సు

**తెర్లాం:** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు మండల కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఇఒ జె.త్రినాధ్ రావు మాట్లాడుతూ ఆయాలు క్రమంగా తప్పకుండా పాఠశాలలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలన్నారు. మరుగుదొడ్లను రోజూ నాలుగు సార్లు ప్రకారం శుభ్రం చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన టాయిలెట్ క్లీనింగ్ కెమికల్స్, క్లీనింగ్ పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ- 2 పాపారావు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్, ఎంఆర్‌సి సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

## 18న పాల రైతుల సదస్సు

**తెర్లాం:** ఈ నెల 18న జామిలో నిర్వహించనున్న పాల రైతుల సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం మండల నాయకులు గోపాలరావు కోరారు. మండలంలోని నందిగాం గ్రామంలో గురువారం పాల రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాల రైతుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. పాల రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారని, రైతుల దగ్గర నుంచి పాల కేంద్రాలు తక్కువ ధరకే పాలను తీసుకొని అధిక లాభాలకు విక్రయిస్తున్నాయని చెప్పారు. పాల డైరీలన్నీ సహకార రంగంలోనికి తీసుకురావాలని డైరీలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని, పలు అంశాలపై ఈ జిల్లా సదస్సులో చర్చిస్తారని రైతులంతా హాజరవ్వాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవనం నిర్మించాలి

**బొబ్బిలి:** కొత్త ఎరుకల వీధిలో సామాజిక భవనం నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిని ప్రజలు కోరారు. పట్టణంలోని కొత్త ఎరుకలవీధి, మహారాజపేటలో గురువారం వార్డు సందర్శన నిర్వహించారు. కొత్త ఎరుకల వీధి సామూహిక మరుగుదొడ్ల పక్కనున్న ఖాళీ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని, వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలని, నేతాజీ మున్సిపల్ పాఠశాలకు బోరు వేయాలని, ప్రధాన మురుగునీటి కాలువకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం నేతాజీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఆమె పరిశీలించారు. భోజనాల్లో నాణ్యత పాటించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## అలల తాకిడికి ముక్కలైన పడవ

**భోగాపురం:** మండలంలోని చేపలకంచేరు తీరంలో గురువారం అలల తాకిడికి పడవ రెండు ముక్కలైంది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గ్రామానికి చెందిన కారి గురువులు తన పడవను ఒడ్డున పెట్టుకున్నారు. ఒక్కసారిగా వచ్చిన అలలకు ఆ పడవ రెండు ముక్కలు అయినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని తెలిపారు.

## ఉపాధి పనులపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి – బాడంగి

మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. ఆయన తన కార్యాలయంలో ఎపిఒ అధ్యక్షతలో గురువారం సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని, ఫార్మ్ పాండ్స్ నిర్మాణాలు చేపట్టాలని, గోకులాలను వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. పల్లె పండుగ గ్రామ పంచాయతీ వారోత్సవాలలో సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డు కచ్చితంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు.

## ఘనంగా ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

నగరంలో హజరత్ మహమ్మద్ అతావుల్లా బాబా ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఈ ఉరుసు ఉత్సవాలు బుధవారం ప్రారంభం కాగా, గురువారం మహా పర్వమైన గంధం షరీఫ్ అత్యంత వేడుకగా జరిగింది. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, ఫకీర్ మేళాల సందడి నడుమ ర్యాలీ సాగింది. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఖాదర్ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, దర్గాలో అన్న సమారాధనను నిర్వహించారు.



బాబా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న శిష్యులు

ప్రజాశక్తి బొబ్బిలిరూరల్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. గురువారం పల్లెపండగ కార్యక్రమంలో మెట్టవలస గ్రామంలో ఆయన పాల్గొని రూ.7.60 కోట్లతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు దేశానికి పట్టు కొమ్మలని తమ ప్రభుత్వం నమ్ముతుందని దీనిలో భాగంగా పల్లెలకు మహర్దశ తీసుకురానున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్, పిఆర్ డిఇ అప్పారావు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, సర్పంచ్ పి.మాధవ, టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**దిబ్బగుడ్డివలసలో..** గ్రామంలో సిసి రోడ్లు, కాలువలకు టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, ఎంపిటిసి వి.నాగరాజు, ఎంపిడిఒ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** పల్లె పండగతో గ్రామాలాభివృద్ధి జరుగుతుందని ప్రత్యేకాధికారి పి. కూర్మి నాయుడు అన్నారు. గురువారం కొత్త పేటలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద సిసి రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, తహశీల్దార్ పి. సుదర్శన రావు, ఇఒపిఆర్‌డి జి. శంకర జగన్నాధం, సర్పంచ్ బడత శ్రీను, నాయకులు గురాన చక్ర దర్ పాల్గొన్నారు.

**తెర్లాం:** మండలంలోని ఎంఆర్ అగ్రహారం, లోచర్ల, కాగాం, అరసబలగా గ్రామాల్లో గురువారం పల్లె పండగ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగపడుతుందని పలువురు సర్పంచులు ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆ గ్రామ సర్పంచులు ఎల్ వెంకటరావు, కె.సాయిరాం, జి.మునిస్వామి, సచివాలయ సెక్రటరీ ఇందిర, టిడిపి నాయకులు తేజావతి తదితరులు పాల్గొన్నారు.

**వేపాడ:** మండలంలోని బాణాదిలో రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి గురువారం శంకుస్థాపన చేశారు. కుంపల్లిలో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులకు ఎంపిపి డి. సత్యవంతుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లవుడు అరుణ, పంచాయతీ కార్యదర్శి కమల, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అంకజోస్యులపాలెంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి టిడిపి అధికార ప్రతినిధి గొంప కృష్ణ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13,324 గ్రామాల్లో ఒకేసారి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి గొంప తులసి, కృష్ణరాయుడుపేట సర్పంచ్ బాలబాబు, కొటాన అర్జునరావు, ఇసరపు రమణ, వంటాకు సముద్రం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: భూమి పూజ చేస్తున్న గొంప కృష్ణ

**మెంటాడ:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.30 లక్షలతో కంటుభుక్త వలస గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని మండల ప్రత్యేకాధికారి ప్రమీల గాంధీ అన్నారు. సర్పంచ్ కొరిపిల్లి బంగారమ్మ అధ్యక్షతన గ్రామ సందర్శన, పల్లె పండగ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న గ్రామం అయినప్పటికీ మంత్రి సంధ్యారాణి గ్రామాన్ని అభివృద్ధి పరచాలని సంకల్పించి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని, మరుగుదొడ్లను తొలగించాలని ఎంఇఒ వర్మకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, ఎంపిటిసి చప్ప సూర్యకుమారి, ఎంపిడిఒ భానుమూర్తి, పంచాయతీ అధికారి విమల కుమారి, పిఆర్‌జెఇ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

**బాడంగి:** మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎరుకులపాకలు గ్రామం లక్ష్మీపురం వెళ్లే రహదారి నిర్మాణానికి పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం సర్పంచ్ పాలవలస పార్వతీ, ఎంపిటిసి పాలవలస గౌరు, మాజీ సర్పంచ్ జాగారపు ఆనందరావు, సచివాలయ సిబ్బందితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాలవలస గౌరు మాట్లాడుతూ గతంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా కొంత మంది అడ్డుకోవడం వల్ల పనులు ముందుకు కదల్లేదన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే బేబీ నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆధ్వర్యంలో తమ గ్రామానికి మెటల్ రోడ్ మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు.

**మెరకముడిదాం:** ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివి అని చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. గురువారం మండల కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు విడతలలో సుమారు పదిన్నర కోట్ల రూపాయలతో కాలువలు, బిటి రోడ్లు, బిల్డింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సుమారు రూ.80లక్షలతో మండల కార్యాలయంలో మీటింగ్ హాల్ నిర్మాణానికి, మరో రూ. 70 లక్షలతో మెరక ముడిదాం గ్రామంలో ఉన్న మంచి నీటి కోనేరు చెరువు గట్టు మీద రహదారులు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, మండల రమణ మోహనరావు, బిజెపి నాయకులు సరిది రామునాయుడు, తల చుట్ల ఈశ్వరరావు, ఎంపిడిఒ భాస్కరరావు, తహశీల్దార్ రఫిజ్, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మార్క్‌ఫెడ్ చైర్మన్

**పూసపాటిరేగ:** గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పల్లె పండగలు నిర్వహిస్తున్నామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. గురువారం మండలంలోని చౌడువాడ, గోవిందపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతో పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు బాలా అప్పలరాజు, గోవిందపురం సర్పంచ్ బాలా రామలక్ష్మి, టిడిపి నాయకులు పసుపులేటి శ్రీనువాసరావు, ఎంపిడిఒ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

**రామభద్రపురం:** గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.26 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధంగా వున్నామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మండలంలోని తారాపురం గ్రామంలో గురువారం పల్లె పండగ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.5.13 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. రానున్న 3 నెలల్లో మరో రూ.8 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షులు విజయభాస్కర్, సర్పంచ్ బెవర రవణమ్మ, ఎంపిటిసి సునీత, పంచాయతీ డిఇ అప్పారావు, ఎంపిడిఒ రత్నం తదితరులు పాల్గొన్నారు.

**సంతకవిటి:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని గొల్లవలస పంచాయతీ ఎస్ అగ్రహారం, ఎంఆర్ అగ్రహారంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంజిత్ కుమార్, ఉపాధి, సచివాలయ సిబ్బంది, నాయకులు మన్నేనా రమేష్, కారు సింహాచలం, కోప్పల శ్రీరాములు, వెంపటాపు మురళి, యడ్ల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి – కొత్తవలస

కొత్తవలస, వియ్యంపేట పిహెచ్‌సిల పరిధిలో ఉన్న ప్రజలు తుపాను నేపథ్యంలో వర్షాల వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు గోపాలకృష్ణ, సీతల్ వర్మ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ నీటి కలుషితం వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గునియా జ్వరాలు, డయేరియా వాంతులు, విరోచనాలు, పచ్చ కామెర్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. ఇంటి పరిసరాలలో కొబ్బరి బొండాలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు లేకుండా చూడాలన్నారు. చేపలు, మాంసం, గోంగూర, నిల్వ ఆహార పదార్థాలు తినరాదని తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీలలో స్థానిక పంచాయతీ సెక్రటరీలు శానిటేషన్, నీటి వనరులు క్లోరి నేషన్ చేయించాలని సూచించారు. పిహెచ్‌సిలతో పాటు అన్ని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్‌లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలకు రక్త పరీక్షలు, నీటి పరీక్షలు చేస్తున్నారని మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## నిబంధనల మేరకే మద్యం దుకాణాలు

ప్రజాశక్తి – రామభద్రపురం

నిబంధనల మేరకే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని, విద్యాలయాలు, ప్రార్థనా స్థలాలు, ఆసుపత్రులకు వంద మీటర్ల దూరంలో ఉండేలా చూసుకోవాలని బొబ్బిలి ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు ఆదేశించారు. మండలంలోని పాత బ్రాందీ షాపుల వద్ద ఉన్న సరుకును గురువారం రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ రహదారికి 220 మీటర్ల దూరంలో షాపులు ఉండేలా ప్రభుత్వం నిబంధనలు విధించిందన్నారు. గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో కొత్తగా ఆరు షాపులు మంజూరయ్యాయన్నారు. వాటి యజమానులు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. కాదని నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా పీడీ యాక్టు నమోదు చేస్తామని తెలిపారు. కొత్తగా మద్యం షాప్‌లు మంజూరైన యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే స్టాకు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఆకుల సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

## జ్యూట్‌మిల్ తెరిపించి ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి – నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ మిల్లును తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపా రావు, కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. గురువారం నెల్లిమర్ల జ్యూట్ మిల్ తెరిపించాలని కోరుతూ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటి తహశీల్దారుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడి సరుకు కొరత పేరిట యాజమాన్యం మిల్లును మూసివేసి 6నెలలు గడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మిల్లు మూసి వేయడం వల్ల కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మిల్లు తిరగడానికి కార్మికులు 5,10, 18 రూపాయలు జ్యూట్ యాజమాన్యానికి అప్పు ఇచ్చారని తిరిగి కార్మికులకు ఒక్కరికి రూ.52,600 చెల్లించాల్సి ఉన్నా ఇంతవరకు ఇవ్వలేదని గుర్తు చేశారు. జ్యూట్ యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో రిటైర్డు కార్మికులకు ఫించన్, ఇఎస్ఐ సౌకర్యాలు పొందలేక పోతున్నారని తెలిపారు. 2016 నుంచి రిటైర్డు కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు కూడా చెల్లించలేదని చెప్పారు. ఈ సమస్యల పై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో కార్మికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, రిటైర్డు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



డిటికి వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

## బానాదిలో డిఎల్‌పిఒ పర్యటన

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో పారిశుధ్య లోపాన్ని పట్టించుకోలేదని గ్రామ సర్పంచ్ కర్రీ యశోద కలెక్టర్‌కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిర్యాదుపై గురువారం బానాది గ్రామాన్ని డిఎల్‌పిఒ కె. మోహన్ రావు సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య లోపం ఉన్న మాట వాస్తవమేనని పంచాయతీ కార్యదర్శి సక్రమంగా విధులు నిర్వహించలేదని కొంతమంది డిఎల్‌పిఒ ఎదుటనే వాదనకు దిగారు. ఈ పంచాయతీ కార్యదర్శి తమకు వద్దని మండిపడ్డారు. పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని ఆయన తెలిపారు.

**విచారణకు వచ్చేటప్పుడు సమాచారం ఇవ్వాలి కదా..?**

గ్రామ సందర్శన ముగించుకుని తిరిగి వెళ్లిపోతున్న డిఎల్‌పిఒను ఎంపిటిసి గొంప తులసి పిలిచి గ్రామంలోకి విచారణకు వచ్చేటప్పుడు ప్రజా ప్రతినిధినైనా తనను పిలిచే బాధ్యత మీకు లేదా అని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పలేక డిఎల్‌పిఒ దాటవేశారు. గ్రామాల్లో గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి పండుగలు జరుపుకుంటున్న ఈ సమయంలో విచారణలా? ప్రభుత్వ అధికారులే సక్రమంగా పనిచేయకుండా బాధ్యతలు విస్మరించి వ్యవహరిస్తూ ఉంటే గ్రామాలు ఏ విధంగా అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు.



డిఎల్‌పిఒను నిలదీస్తున్న ఎంపిటిసి తులసి





మాట్లాడుతున్న సర్పంచ్ సుబ్రమణ్యం, తహశీల్దార్ కృష్ణలత

## సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన

ప్రజాశక్తి – జామి

గ్రామ సమస్యలు పరిష్కారం కోసం గ్రామ సందర్శన కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని తహశీల్దారు కృష్ణలత అన్నారు. గురువారం మండలంలోని చింతాడ గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం సంధర్భంగా సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఇందులో భాగంగా మండల స్థాయి అధికారులు గ్రామ వీధుల్లో పర్యటన చేశారు. గ్రామంలో వున్న యంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను అధికారులు పరిశీలించి పిల్లలకు మంచి పోషకాలతో కూడిన భోజనం పెట్టాలని నిర్వాకులకు సూచించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి.కిరణ్ కుమార్, ఎంపిటిసి, ఎఒ వి.నరసింహం ఇతర శాఖల అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులుగా వెంకటరమణ

ప్రజాశక్తి– విజయనగరం



జాతీయ మానవ హక్కులు, యాంటీ కరెప్షన్, యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థకు విజయనగరం జిల్లా అధ్యక్షుడుగా నగరానికి చెందిన డాక్టర్ పిరిడి వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్. జ్యోతీశ్వరరెడ్డి నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వెంకటరమణ చేస్తున్న సామాజిక సేవను పరిగణలోనికి తీసుకుని ఈ నియామకం చేపట్టినట్లు జాతీయ అధ్యక్షుడు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని, అవినీత వ్యతిరేక, నేర వ్యతిరేక సమాజ నిర్మాణం కోసం అంకితం కావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తన బాధ్యతలను శత శాతం విజయవంతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

## నేరాలు ఘోరాలు

### పెళ్లిలో ఘర్షణ.. పది మందికి గాయాలు

**రేగిడి:** మండలంలోని కోడిశ గ్రామంలో పొట్నూరు గౌరునాయుడు కుమారుడు గోపాల్ రావు పెళ్లిలో నెల్లి పెంటన్నాయుడు (వైసిపి), నెల్లి సతీష్ (టిడిపి) రెండు వర్గాల మధ్య పాత కక్షలు కారణంగా ఘర్షణపడి పదిమందికి గాయాలయ్యాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిడిపి వర్గానికి చెందిన నెల్లి సతీష్, వైసిపికి చెందిన నెల్లి పెంట న్నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్ద వెళ్లి ఘర్షణలకు గల కారణాలు అడిగి తెలుసుకుని రికార్డ్ చేశారు. ఇరు వర్గాల నుంచి చెరో అయిదుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి నాయకులు పెంటన్నాయుడును ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి తలే రాజేష్, వైస్ ఎంపిపిలు టెంకాల అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు పరామర్శించారు.



మృతుని వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

### చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి– బాడంగి

బాడంగి గ్రామానికి చెందిన కండి రమేష్ (52) కోనేటికి మలవిసర్జనకి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి గురువారం మృతి చెందాడు. మృతుడు భార్యతో కలిసి పళ్ళు వ్యాపారం చేసికొంటూ జీవనం సాగించేవాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

### తండ్రి మందలించాడని అదృశ్యమైన బాలుడు

**భోగాపురం:** పాఠశాలకు వెళ్ళననడంతో తండ్రి మందలించాడని 14ఏళ్ల బాలుడు బుధవారం అదృశ్యమయ్యాడు. దీంతో బాలుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యకుమారి గురువారం కేసు నమోదు చేశారు. ఆమె అందించిన వివరాలు ప్రకారం.. మండలంలోని సిమ్మపేట వద్దనున్న జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న గురయ్య, రమలకు ఇద్దరు కుమారులు. ఇందులో చిన్న కుమారుడు భోగాపురంలోని మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్ళనని చెప్పడంతో తండ్రి మందలించాడు. దీంతో వెంటనే పాఠశాలకు వెళ్లిపోతానని చెప్పి సైకిల్‌పై బయలుదేరాడు. తీరా సాయంత్రం ఇంటికి రాకపోయేసరికి పాఠశాలకు ఫోన్ చేయగా రాలేదని చెప్పారు. దీంతో వెంటనే వెతకడం ప్రారంభించారు. గురువారం ఉదయం నారు పేట సమీపంలో హైవే పైన ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో స్కూల్ బ్యాగ్ లభించింది. ఇంటి సమీపంలో ఉన్న చెరువు వద్ద బూట్లు ఉన్నాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది చెరువు వద్ద వెతకగా బాలుడుతో పాటు సైకిల్ సంబంధించిన ఆనవాళ్లు దొరకలేదు. హైవే పైన ఉన్న అపర్ణ హోటల్ వద్ద సైకిల్ లభించడంతో ఎక్కడికో పారిపోయి ఉంటాడని భావిస్తున్నారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

**IN THE HONOURABLE COURT OF THE FIRST ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VIZIANAGARAM**
**E.P. 74/2023: O.S. 336/2020**
**(NOTICE UNDER ORDER 21 RULE 64 C.P.C.)**

Between:
Pinjala Dhaneeswari...Decree Holder
AND:
Sirigidi Adilakshmi....Judgment Debtor
To,
Sirigidi Adilakshmi, W/o Srinivasa Rao
B.C.Colony, REDDI KANCHERU VILLAGE
Kancheru Post, Bhogapuram Mandal,
Vizianagaram District

Whereas the above named Decree Holder-Plaintiff has instituted the above E.P. 74/2023 against you for Recovery of E.P. amount. You are hereby summoned to appear in this Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the E.P. who shall be able to answer all such questions on the **13th Day of NOVEMBER, 2024, at 10-30 A.M.** to answer the claim.

By Order of the Honourable Court

Vizianagaram
Dt. 16-10-2024

**I. RAMESH**
ADVOCATE,
VIZIANAGARAM
Cell: 94407 38240

**IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE CUM SPECIAL JUDGE, S.C & S.T. (POA) CASES AT VIZIANAGARAM.**
**E.P.No. 38/2018 in O.S.No.21/2010**

Between:-
Sri Allu Dali Babu. ......Plaintiff.
And:-
Sri. Bali Krishna etc., ....... Defendants.

**NOTICE TO THE RESPONDENTS/ DEFENDANTS No.34, 40 & 42**

**R34.** Althi Suresh, S/o Althi Appalaram, Hindu, aged about 38 years residing at Geddapeta Village, presently at Gajapathinagaram, Opp., Gangaraju Theater, Vizianagaram.

**R40.** Sandhya, W/o Kirankumar, Hindu, aged about 34 years, R/o C/o Sri Kiram Kumar, Manager, ITC, Bhadrachalam, Khamma District.

**R42.** Mahanthi Jaya, W/o Giri, Hindu, aged about 38 years, R/o Rajam, Vizianagaram District.

Please take notice that the above matter stands posted to 01.11.2024 for the appearance of the respondents/defendants before the Honourable IV Additional District Judge Cum S.C. & S.T., Judge Court at Vizianagaram by 10.30 a.m. If you fail to appear before the said Honourable court by **10.30 a.m., on 01.11.2024** in person or through an advocate, the above matter will be decided in your absence and ex-parte.

**DAMODAR RAMA MOHAN RAO (DAMU)**
Advocate for the Petitioner/plaintiff.
Vizianagaram, Cell: 93933 28926